# వడ్డీకాసులు

ఎండ చిటపటలాడుతోంది.

కొల్లేటి చాంతాడులా ఉంది క్యూ. చాలా మెల్లిగా కదులుతోంది.

అందరికీ ఆత్రుతే! కదలిక చురుగ్గా వుంటే, నాకీ విసుగు వుండకపోను మనుషులు మరీ దగ్గరగా వుండటం వలన, చెమట వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

వెనకనుండి ఎవరో ముందుకి నెట్టుతున్నారు.

నిలదొక్కుకున్నాను. లేకపోతే, ఆడమనిషి మీదపడే వాణ్ని. సీరియస్‌గా వెనక్కి తిరిగాను.

"గోవిందా...గోవిందా" అన్నదొక సన్నని గుండు.

ఆ గుండుకి నలభై వళ్ళుంటాయి. కళ్ళకు రోల్డుగోల్డు సులోచనాలున్నాయి. చూస్తే మర్యాదస్థుడిలాగే కనిపించాడు.

"క్షమించాలి, వెనకనుండి నెట్టారు నిలదొక్కుకోలేక పోయాను" సంజాయిషీ యిచ్చుకున్నాడు.

క్షమించక తప్పలేదు.

తల తిప్పుకున్నాను.

"ఘూర్" న త్తలా కదుల్తోంది.

మళ్ళీ యిందులోనే బోలెడుచుట్లు. కోతులు యథేచ్ఛగా తిరుగుతూ యాత్రికులతో పరాచికాలు ఆడటం చూస్తూ కళ్ళకు కాస్త కాలక్షేపం కల్పించుకున్నాను.

"మీదే ఊరు సార్?"

తలతిప్పి చూశాను గుండుమీద చెయ్యేసి తడుముకుంటూ నవ్వేడు.

"బెజవాడ" అన్నాను క్లుప్తంగా.

"బెజవాడా? ఎక్కడుంటున్నారు బెజవాడలో?"

"మీదీ బెజవాడేనా? నేను పుట్టిందీ, పెరిగిందీ, చదివిందీ, పెళ్ళిచేసుకుందీ...."

"మాది సత్యనారాయణపురం!" ఆయన ధోరణికి బ్రేకు వేశాను.

"అలాగా? ఏ వీధి?"

"శివరావు స్ట్రీటు"

"అయితే మీకు ప్రకాశరావుగారు తెలుసేమో? సైన్సు మాష్టరు...."

"తెలుసు..."

"ఆయన నాకు పినతండ్రి వరస, తరచు అక్కడికి వస్తుంటాను, నేను వుండేది సామారంగం చౌక్ లో లెండి"

"అలాగా?"

ఇలా ఆరంభమయిన సంభాషణ ఏడుకొండలవాని ముందు చేతులుజోడించేవరకూ కొనసాగుతూనేవుంది. కొన్ని క్షణాలు చూశానేమో "పదండి బాబూ..." అంటూ మర్యాదగా హెచ్చరించాడు పూజారి.

ఆ విగ్రహంలో ఏమి ఆకర్షణ వుందో, ముందుకి వెళ్ళాలంటే అడుగు పడలేదు, మరో హెచ్చరికతో కదలక తప్పలేదు.

"హుండీ" దగ్గరకు వెళ్ళాం. చుట్టూ ప్రదక్షిణ చేసి "ముడుపు"లు వేశాను. ఆయన పేరు నీలకంఠమూర్తి. తను కూడ ముడుపులు వేశాడు.

బయటకి వెళ్ళబోతూ ఒక్క క్షణం ఆగిచూశాను.

ఇందాక నేను మీదపడబోయి నిలద్రొక్కుకున్నానే

ఆ ముత్తయిదువ అమాంతం మంగళ సూత్రాలు హుండీలో వేసేసింది! మెళ్ళో పసుపుకొమ్ము వేలాడుతోంది.

ఆ మొహం చూస్తుంటే, ఎవరికయినా జాలి పొంగి పోతుంది. బీదరికం అంత స్పష్టంగా, తీర్చిదిద్దినట్టుండటం చాలా అరుదుగా చూస్తాం ఆవిడ బిచ్చగత్తెలా ఉండను కోవటం శుద్ధపొరపాటు. కాదు—గౌరవనీయంగా బ్రతికే పడతి అని యిట్టే చెప్పవచ్చు.

ఆ మొహంలో కనిపించే ప్రశాంతత చాలా అసాధారణమైంది. తుఫాను అణిగిపోయినతర్వాత సరీగ్గా ఇలాంటి ప్రశాంతతే కనిపిస్తుంది. ఆ తీవ్ర సంక్షోభానికి గురయి దెబ్బతిన్న వృక్షం కూలిపోకుండా ఎలాగోలా నిలబడితే ఆమెలాగానే వుంటుంది.

ఆమె ఓ జబ్బు మనిషి. బహుశ భర్త అయివుండాలి. క్షవరం చేసిన బోడితలతో ఉన్నాడు. యిద్దరూ బయటికి వెళ్ళారు. నేనుకూడ బైటికి నడిచేను. నీలకంఠమూర్తి ఏం చెబుతున్నాడో వినటంలేదు నేను, కానీ, ఆయన ఎడతెగకుండా మాట్లాడుతూనే వున్నాడు.

నేను ఆ దంపతుల్ని గమనిస్తున్నాను.

ఇద్దరూ ఆలయంలో కాస్త అనువుగా వున్న చోటు చూసుకొని కూర్చున్నారు. ప్రసాదం తీసుకుంటున్నారు.

నా పరధ్యానం గమనించాడు నీలకంఠమూర్తి, తను కూడా అటు చూశాడు.

“వాళ్ళు చాలా కష్టదశలో ఉన్నారు. బహుశ అతని కేదో ప్రాణాంతకమైన జబ్బుచేసి ఉంటుంది. ఆవిడ ఆపద మొక్కులు మొక్కుకోగా నెమ్మదించి వుంటుంది. చెల్లించుకోవటానికి వచ్చి వుంటారు.”

నీలకంఠమూర్తి మాటలకి “అవును” అన్నట్టే తలాడించాను. ఆయన వివరించకముందే ఆ విషయాన్ని ఊహించాను. కానీ,

నా ఆలోచనలు అవికావు. మరికాస్త దీర్ఘంగా ఆలోచిస్తుంటే ఎన్నో ప్రశ్నలు, కుతూహలం, సందేహాలు ఉత్పన్నమైనాయి,

నాకళ్ళముందు ఆమె మెళ్ళోనుండి మంగళసూత్రాలు తీసి హుండీలో వేస్తున్న దృశ్యం ఇంకా కదులుతోంది. ఆ పేదరాలి కది “నిలువుదోపిడి” కాబోలు నొసటిమీద పెద్ద కుంకుమ బొట్టు. మొహంలో కలిగే పవిత్రత కళ్ళలోని ప్రశాంతత సగం వెలసిన చీర-ఆమె రూపం అలా ముద్రలా పడింది మనసుమీద.

పరిశీలించి చూస్తే చితికిపోయిన మధ్యతరగతి కుటుంబంలా తోచింది.

నాలో సందేహాలు యిలా తలెత్తాయి.

ఏదో ఆపదలో మొక్కుకున్నది బాగానే వుంది. మరి గడ్డు పరిస్థితిలో గాక కాస్త తేరుకొన్న తర్వాత వచ్చి వుంటే? అనగా—

అతని సంపాదనే ఆధారమైవుండొచ్చు. అతను కోలు కోవటానికి మందుల క్రింద మరి యితర ఖర్చుల క్రింద చాలా ఖర్చయి వుండవచ్చు. వీటన్నిటిమీద అతను ఇంకా బలం చేకూర్చుకొనక ముందే భగవద్దర్శనానికి పరిగెత్తుకు రావాల్సిన తొందరేమిటో?

మరి, ఈ ప్రయాణ నిమిత్తం ఎక్కడ చేబదులు తెచ్చారో లేక ఏ వస్తువు కుదువపెట్టినారో ఇన్ని కష్టాలకు ఓర్చి వస్తే యిక్కడేమన్నా యిబ్బందులెదురయితే ఆదుకునేదెవరు?

నీలకంఠ మూర్తినడిగాను.

"అంతా నీదేభారం అనుకొంటే ఆ వడ్డికాసులవాడే చూసుకుంటాడు. తర్వాత తీర్చుకుందామని వాయిదాలు వేస్తే దానికి అంక్కడ? ఒ తెక్కనాటితో తీరేవా? వేడిలో వేడిగా వచ్చేసి వుంటారు. లేకపోతే వడ్డీకాసులు చెల్లించ వద్దూ"

"అదేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"అన్నప్రకారం మొక్కుబడులు చెల్లించని వాళ్ళ అపరాధపు వడ్డీకాసులు వేస్తారు. వాటిని బయట అమ్మరారు."

నేను మరో మాట మాట్లాడలేదు మౌనంగా తల ఆడించటం మినహా.

నీలకంఠమూర్తి నేను మా బసలకు తిరిగి చేరుకున్నాము.

ఆ మర్నాడు యిద్దరమూ పాపనాశనం, ఆకాశగంగ వెళ్ళాము.

నీలకంఠమూర్తి స్నేహితుడెవరో కనిపించాడు, పరిచయంచేశాడు. ఆయన "వోల్టాస్" కంపెనీలో పెద్దఉద్యోగి. బొంబాయిలో పని చేస్తున్నాడు పేరు ఆనందరావు.

సరదాగా మాట్లాడుతూ అందర్నీ ఆనందంగా ఉంచే ఆనందరావు నిజంగా పేరుకు తగ్గవాడు. బొంబాయి కబుర్లు చాలా చెప్పాడు. "స్మగుల్డు" వస్తువుల గురించి, ఆ వ్యాపారం చేసే మనుషుల గురించి, చాలా కథలు చెప్పాడు కాలక్షేపం బాగా అయింది.

ముగ్గురం కలసి కొండలన్నీ కలియదిరిగాము.

కలిసి ఆ రాత్రి భోజనం చేశాము.

మర్నాడు తిరుగు ప్రయాణం అనుకున్నాము. ఆనందరావుది ఏలూరు. బెజవాడలో దిగి బస్సులో వెళతానన్నాడు.

దిగువ తిరుపతికి వచ్చి గోవిందరాజులస్వామి దర్శనం కూడా చేసుకున్నాం. తీరా స్టేషనుకు వెళ్ళే వేళకు ఆనందరావు ఏదో జ్ఞాపకం వచ్చినవాడికిమల్లే "ఒరేయ్ నీలకంఠం! ఓమాటు యూనివర్సిటీదాకా వెళ్ళొద్దాం. మన

రమణారావు యిక్కడ ప్రొఫెసరుగా వుంటున్నాడు. గట్టిగా రమ్మనమని రాశాడు—" అని నీలకంఠమూర్తి రెక్కపట్టుకునిలాక్కెళ్ళబోతూ "క్షమించండి మాష్టారూ! మేమిద్దరం తొందరగానే తిరిగొస్తాం. మీరు ఈ డబ్బు తీసుకొని మీతో బాటు మాక్కూడా బెజవాడకు కొనెయ్యండి... మీరు నేరుగా వెళ్ళి రైల్లో కూర్చొని మాకు చోటు ఉంచండి." అంటూ నా సమాధానంతో నిమిత్తంలేనట్టు నా చేతిలో డబ్బుకుక్కి పరుగుపెట్టారు.

నాకు వాళ్ళ ధోరణి కాస్త నిరుత్సాహం కలిగించినా "పోనీలే! బాగా దగ్గర స్నేహితుడు కాబోలు. రైలు కదిలే ముందు వస్తామన్నారు గదా!" అని సమాధానం చెప్పుకొన్నాను.

ముందుగా వెళ్ళి బెజవాడకి మూడు టిక్కెట్లు కొని నేను కిటికీ దగ్గర కూర్చుని, వాళ్ళిద్దరూ కూర్చోవటానికి అనువుగా జాగా చూసి అక్కడ రెండు వారపత్రికలు పడేసి, నా "లెదర్ బ్యాగ్" కూడా పెట్టాను. కిటికీలోంచి తల బైటికి పెట్టి ప్రవేశద్వారం కేసి ఆత్రుతగా చూస్తూ కూర్చున్నాను. వాళ్ళు అందులోంచే రావాలి వస్తే నాకు కనిపించితీరాలి.

పెట్టె నిండిపోతోంది.
నాకు ఆదుర్దా పెరిగిపోతోంది,
నిముషాలు గడిచిపోతున్నాయి. గడియారం చూసుకుంటున్నాను. రైలు బయులుదేరటానికి రెండు నిముషాలే వ్యవధి!

అసహనం ఆగ్రహం తొంగిచూస్తున్న చూపులతో, కొనవూపిరితో వున్న ఓపికతో యింకా ప్రవేశద్వారం కేసి చూస్తూనే వున్నాను.

గార్డు విజిలు ఊదాడు.

రైలు కదిలింది. ప్లాట్‌ఫారం దూరం అవుతున్నంత సేపూ, పరిగెడుతూవచ్చి రైలెక్కుతారేమోనని చూశాను. ఒకవేళ వాళ్ళు పరుగులో రైలుని అందుకోలేక పోవటం జరిగితే, గొలుసులాగి రైలునాపాలని కూడా నిర్ణయించుకొన్నాను.

రైలు నిరాటకంగా వెళ్ళిపోతోంది. అప్పుడు తల తిప్పుకున్నాను. మెడకూడానొప్పి చేసింది అదేపనిగా చూట్టంవల్ల.

"బాబూ! ఇక్కడెవరూ లేకపోతే జాగా ఇవ్వండీ కాస్త, ఆయన జబ్బు మనిషి" తృళ్ళిపడ్డాను. ఆమె ఎవరో మెడలోని పసుపుకొమ్ము చెప్పింది. ఆ మొహం నాకు బాగా గుర్తు. ఆ జబ్బు మనిషి కూడా.

సీటు మీదనుండి నా వస్తువులు తీసేసి "కూర్చోండి" అన్నాను మర్యాదగా. ఇద్దరూ కూర్చున్నారు.

"చాలా థాంక్స్ సార్!" అతను నీరసంగా గొణిగేడు.

"నో మెన్షన్.." అని అతన్ని పరిశీలనగా చూశాను. చాలా బలహీనంగా వున్నాడు కానీ, వయసు మళ్ళినవాడు మాత్రం కాదు. మహావుంటే ముప్పది ఐదేళ్ళు, ఆమె కో

పాతిక ఉండొచ్చును. కానీ వయసుకంటే జీవితంలో ఎక్కువ అనుభవాలు గడించినవాళ్ళలా కనిపిస్తారు. అందువల్ల వయస్సుకూడా ఎక్కువనిపిస్తుంది హఠాత్తుగా చూస్తే.

"టికెట్ ప్లీజ్" అంటూ వచ్చాడు టికెట్ కలెక్టరు వాళ్ళ మొహాలలో కలవరం కనిపించింది.

"కొనలేకపోయాం. తిరుగు ప్రయాణానికి డబ్బు చాల్లేదు!" అందామె దీనంగా. "అయితే, తరువాత స్టేషనులో దిగాల్సి వుంటుంది" అన్నాడు కఠినంగా. వాళ్ళు సమాధానం చెప్పలేదు. దిగులు గూడు కట్టుకున్న కళ్ళతో మౌనంగా కూర్చున్నారు.

జేబులోంచి మూడు టిక్కెట్లు తీసి "వాళ్ళని దింపనక్కర్లేదు. నాతో బాటు బెజవాడదాకా వస్తారు" అని టికెట్ కలెక్టరుకి యిచ్చాను.

అతను తెల్లబోయి "ఓకే" అని పెన్సిల్‌తో సంతకాలు పెట్టి యిచ్చేశాడు. వాళ్ళు కృతజ్ఞతాభారంతో మాట్లాడలేకపోయారు చేతులు జోడించటం మినహా. నేను మందహాసం చేస్తూ ఒక ప్రశ్న వేశాను.

"వస్తారనుకున్న స్నేహితులు సకాలంలో వచ్చి, నేను మీకు సాయం చెయ్యలేకపోయి ఉంటే వడ్డికాసులవాడే విధంగా మిమ్మల్ని ఆదుకునేవాడు?"

ఇది వాళ్ళకు భగవంతుని మీదగల విశ్వాసాన్ని కొలవగల ప్రశ్న. కష్టాలలో భగవంతుడు ఆదుకోలేపోతే, ఆయనలో దైవత్వమే శూన్యమన్న ధోరణిగల మనుషులు యీ ప్రశ్నతో బయట పడిపోతారు.

ఆమె నా ప్రశ్నకు చిరు మందహాసం చేసింది.

"వస్తారనుకున్న స్నేహితుల్ని రాకుండా చేసి. మమ్మల్ని మీ కరుణకు పాత్రుల్నిగా చేయడం ద్వారానే —" అని సమాధానం!

[పంచాయత్]